

కడప- చెన్నై రహదారిపై లారీ దగ్ధం

మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి - సిద్ధవటం (ఒంటిమిట్ట)

కడప - చెన్నై జాతీయ రహదారిపై లారీ ఇసుక లోడుతో ముద్దనూరు నుంచి చెన్నైకి బయలు దేరింది. మాధవరం1 వద్దకు రాగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమై లారీ దిగారు. విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ చిరంజీవి చేరుకుని ప్రమాదఘటనపై విచారిస్తున్నారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల వాహనాలు పూర్తిగా నిలిచిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. డ్రైవర్ ప్రసాద్ తెలిపిన సమాచారం మేరకు పోలీసులు విచారిస్తున్నారు

నామినేటెడ్ ఆశలు!

దసరాలోపు నియమించే అవకాశాలు

టిడిపి కేడర్‌లో ఉత్సాహం



జిల్లాలోని తెలుగు తమ్ముళ్లలో నామినేటెడ్ ఆశల కోలాహలం నెలకొంది. రాష్ట్రంలో వరద విలయం ముగిసిన నేపథ్యంలో దసరా పండుగ లోపు నామినేటెడ్ పోస్టుల భర్తీకి ముందుకెళ్లే అవకాశాలు ఉన్నాయనే సంకేతాల నేపథ్యంలో టిడిపి కేడర్‌లో ఉత్సాహం నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలకు నామినేటెడ్ పోస్టుల పంపిణీకి ఓ ఫార్ములాను రూపొందించిన సంగతి తెలిసిందే. కూటమి పార్టీలకు పోగా మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియలో వైసిపి శ్రేణుల బారిన పడి తీవ్రంగా గాయపడిన సంఘటనల్లో ప్రాణాలతో మిగిలిన కేడర్‌ను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వనున్నారా, నియోజకవర్గ ఇన్‌ఛార్జిల సిఫారసు లెటర్ల ఆధారంగా ఇస్తుందా అనే చర్చ నడుస్తోంది. ఇన్‌ఛార్జిల లెటర్లు ఆధారంగా నామినేటెడ్ పోస్టులు ఇస్తే పార్టీ కోసం ప్రాణాలొడ్డిన కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందనే వాదన బలంగా వినిపిస్తోంది. నియోజకవర్గ, పార్లమెంట్ ఇన్‌ఛార్జిలు ఒకటి, రెండు అధిపత్య కుల, సామాజిక తరగతులకు చెందిన కార్యకర్తలను మాత్రమే సిఫారసు లెటర్లు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని వాదన వినిపిస్తోంది. వైసిపి బారిన పడి తీవ్రంగా నష్టపోయిన కార్యకర్తల డేటా స్వీకరణ, మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా, రాష్ట్ర నాయకత్వం స్వతంత్ర్య ఏజెన్సీలు, వేగుల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా ముందుకెళ్తే కొంత మేరకు ప్రయోజనం నెరవేరే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు అనుకూలముగా రావడంతో వైసిపి కేడర్ సాగించిన భౌతిక, ఆర్థిక, దాడుల్లో 82 మంది టిడిపి కార్యకర్తలపై అరాచకం రాజ్యమేలిన సంగతి తెలిసిందే. ఒంటిమిట్ట మండలం నడింపల్లికి చెందిన గగ్గుటూరి మౌలాలి మొదటి వరుసలో ఉన్నారనడంలో సందేహం లేదు. 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడక ముందే రాష్ట్రంలోనే మొదటగా ఈయన ఇంటి ముంగిట పటాసులు పేల్చడాన్ని ప్రస్తావించిన పాపానికి కర్రలు, రాళ్లతో తీవ్రంగా గాయ పరిచిన ఘటనలో అపస్మారక స్థితిలోకి పోయిన సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది టిడిపి కార్యకర్తలపై పెద్దఎత్తున దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో టిడిపి అధ్యక్షులు చంద్రబాబు 2019 డిసెంబర్‌లో కడప నగర శివారులోని ఓ ఫంక్షన్ హాలులో బాధితులందరినీ సమీకరించి వారిలో ధైర్యాన్ని నూరిపోసిన సందర్భంలో దాడుల్లో గాయపడిన, నష్టపోయిన బాధితులందరికీ ఆర్థిక, న్యాయ, నామినేషన్ పదవుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధికారంలో వచ్చిన వెంటనే టిడిపి అధ్యక్షులు చంద్రబాబు బాధిత కార్యకర్తల సంరక్షణకు ఉద్దేశించి కమిటీ వేసి గ్రీవెన్స్ పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చి 100 రోజులు గడిచినప్పటికీ ఎటువంటి సహకారం అందిన దాఖలాల్లేవు. ఆర్థిక సహకారం, నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యతపై ఇచ్చిన హామీని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో ఆయనను ధిక్కరించి, నిరసనలు, ధర్నాలకు దిగిన బడుగు, బలహీన వర్గాలకు చెందిన కార్యకర్తలకు కేటగిరీలకు అతీతమైన పదవులు కట్టబెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.

కూటమి పార్టీలకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో భాగస్వామ్యం ఇవ్వడంతో టిడిపి గణనీయంగా నష్టపోనుంది. టిడిపి ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో 30 శాతం జనసేన, 10 శాతం బిజెపి కార్యకర్తలకు, బిజెపి ఎమ్మెల్యే ఉన్న స్థానాల్లో టిడిపికి 50 శాతం, బిజెపి, జనసేనలకు 50 శాతం నామినేటెడ్ పోస్టులు కేటాయిస్తే అప్పట్లో వైసిపి బారిన పడిన తమ పరిస్థితి ఏమిటనే చర్చ నడుస్తోంది. అప్పట్లో జనసేన, బిజెపి కార్యకర్తలు ఎలాంటి కష్టనష్టాలను ఎదుర్కోలేదనే విషయాన్ని ప్రస్తావిస్తుండడం గమనార్హం. రాష్ట్రంలో జనసేన, బిజె పి ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో టిడిపి కార్యకర్తలు తీవ్రంగా నష్టపోనున్నట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో టిడిపి అధ్యక్షులు నామినేటెడ్ పోస్టుల భర్తీలో కడప జిల్లాలోని కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు టికెట్లు త్యాగం చేసిన సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తారా, వైఎస్ జగన్ సొంత జిల్లాలోని బలమైన వైసిపి కేడర్ దాడుల బారిన పడిన టిడిపి కార్యకర్తలకు ఎవరికి ఏమేరకు న్యాయం చేస్తారో అనేది వేచి చూడాల్సి ఉంది.

యురేనియం.. లీకులమయం

- ప్రమాదపుటంచుల్లో ప్రజలు
- ఇప్పటికే పలుమార్లు లీకేజీలు
- పట్టని అధికారులు
- సోమవారం మళ్లీ లీకైన పైప్‌లైన్
- ఆందోళన చేపట్టిన కె.కె.కొట్టాల గ్రామస్తులు
- డిఎస్‌పి హామీతో విరమణ
- నేడు యురేనియం అధికారులతో చర్చలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎస్‌పి

ప్రజాశక్తి-వేముల

మండల పరిధిలోని తుమ్మలపల్లిలో ఏర్పాటు చేసిన యుసిఐఎల్ కర్మాగారం నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో చుట్టుపక్కల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కర్మాగారం నుంచి టెయిలింగ్‌పాండ్‌కు తరలించే పైప్‌లైన్లు తరచూ లీకేజీ అవుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా కర్మాగారం నుంచి కె.కె. కొట్టాల గ్రామ సమీపంలోని టెయిలింగ్ పాండ్ మీదుగా వెళ్తున్న పైప్‌లైన్ పదేపదే లీకవు తోంది. గతంలో 2021 నవంబర్ 19న, 2022 డిసెంబర్ 25, ఈ ఏడాది ఫిబ్రవరి 2024లో, ఇప్పుడు మరోసారి పైప్‌లైన్ నుంచి యురేనియం వ్యర్థాలు లీకేజీ అవుతూనే ఉంది. లీకైన వ్యర్థ పదార్థాలు బహిరంగ పడి నేరుగా భూగ ర్భంలోకి ఇంకిపోయి నీరు కలుషితం కావడంతోపాటు పొలాలు కూడా పాడవుతాయని గ్రామ స్తులు వాపోతున్నారు. పైగా పశువులు కూడా చనిపోయే ప్రమా దముందని వాపోతున్నారు. పైపులను సరిచేయాల్సిన అధికారులు మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.



పైపు నుంచి లీకవుతున్న వ్యర్థాలు

ఇదీలా ఉండగా సోమవారం కె.కె కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న పైప్‌లైన్ లీక్ అవడంతో సంఘటన స్థలంలోనే గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. కర్మాగారం నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలు టెయిలింగ్ పాండ్ వెళ్లకుండా పైప్‌లైన్ లీకై పొలాలకు వెళ్తున్న పరిస్థితి నెలకొంది. పైప్‌లైన్‌ను మరమ్మతులు చేయడానికి వచ్చిన అధికారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న సిఐ నాగరాజు, ఎస్ఐ ప్రవీణ్ సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ వ్యర్థాల వల్ల ప్రజల ఆరోగ్యాలకు ముప్పు వాటిల్లుతోందని పేర్కొన్నారు. పైగా పంట పొలాలు పాడై నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. పలుమార్లు పైప్‌లైన్ లీకేజీ అవుతుంటే కర్మాగారం అధికారులు కేవలం తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతూ తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాము యురేనియం అధికారులు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని పేర్కొన్నారు. వ్యర్థాల విషయంలో పరిష్కారం చూపలేదన్నారు. రానురాను పశు సంపద కూడా క్షీణిస్తోందని చెప్పారు. బోర్ల కింద నీరు కలుషితం కావడంతో పంటలు సరిగ్గా పండక దిగుబడి రావడం లేదని చెప్పారు. ఏ ఒక్క జిల్లా ఉన్నతాధికారి కూడా పైప్‌లైన్‌కు శాశ్వత పరిష్కారం చూపలేదన్నారు. తమ ప్రాణాలకే ముప్పు తెస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కెకె కొట్టాల గ్రామాన్ని యురేనియం సంస్థ దత్తత తీసుకుని తమకు పునరావాసం కల్పిందుకు చర్యలు తీసుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారమని చెప్పారు. ఇకపై ఉపేక్షించేది లేదని, దీని కోసం యురేనియం పనులు అడ్డుకోవడానికైనా సిద్ధమని గ్రామస్తులు తెగేసి చెప్పారు. యురినియం అధికారులతో మాట్లాడుతామని సిఐ నాగరాజు వారితో చెప్పారు. వారు వినకపోవడంతో ఈ విషయాన్ని డిఎస్‌పి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని మరో సారి గ్రామస్తులను సర్దిజెప్పారు. మంగళవారం డిఎస్‌పి కార్యాలయంలో యురేనియం అధికారులతో సమావేశమై మీ సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయండి

ప్రజాశక్తి - బద్వేలు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగా విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని టిడిపి జనసేనలకు సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, ఐద్వా మహిళా సంఘం నాయకులు పి మోక్షమ్మ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని రోజురోజుకూ ఉత్పత్తి సామర్థ్యం తగ్గిస్తున్నారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కావాలని నష్టాల్లోకి నెట్టి ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టే కుట్రలు పన్నుతుందని, ప్లాంట్ పూర్తిగా మునిగిపోక ముందే టిడిపి, జనసేన పార్టీలు కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని నిలదీసి ప్లాంట్ పరిరక్షణకు పూనుకోవాలని వారి డిమాండ్ చేశారు. తమకు అధికారం ఇస్తే స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపి అభివృద్ధి పథంలో నడిపిస్తామని కేంద్ర బిజెపి రాష్ట్ర టిడిపి, జనసేన కూటమి పార్టీలు ఎన్నికలలో వాగ్దానం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అధికారం చేపట్టాక మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కును రోజురోజుకూ అంధకారంలోకి నెడుతుంటే టిడిపి జనసేన పార్టీలు చోద్యం చూడడం దుర్మార్గమన్నారు. 32 మంది ప్రాణ బలిదానం ఆవేశ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును తెగ నమ్మితే ప్రజలు చూస్తూ ఊరుకోరని తగిన శాస్తి చెప్తారని వారు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేట్ పరం చేయకుండా ఒత్తిడి తీసుకురావాలని, అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం కూటమి నుండి వైదొలగాలని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో మేధావులు విద్యార్థులు ప్రజలు యువత ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున పోరాడుతారని వారు తెలియజేశారు. సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కార్యదర్శి ఎస్ కే ఆదిల్, సిఐటియు నాయకులు రాయప్ప, గంప సుబ్బరాయుడు, రాజగోపాల్ బాలు, శౌరి నరసింహ ఐద్వా మహిళా సంఘం నాయకులు ఎస్.కె కైరున్ బి, రామలక్ష్మమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఉచిత పంటల బీమా అమలు చేయాలి

- ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం 2024 రబీ, 2025 ఖరఫ్, రబీ సీజన్‌లకు పంటలబీమా కొత్త విధానం ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అవకాశం కల్పించడం ద్వారా రైతులకు నష్టదాయకంగా ఉంటుందని ఎపి రైతు సంఘం కడప జిల్లా అధ్యక్షులు ఎ.గోపాలకృష్ణయ్య తెలిపారు. సోమవారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర ఉచిత పంటల బీమా విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. రైతుల భాగస్వామ్యం పేరుతో భారం వేసే విధానాన్ని మానుకోవాలన్నారు. గతంలో బ్యాంకులో పంటల రుణం తీసుకునే రైతులకు ఇన్సూరెన్స్ ప్రీమియం రుణం మొత్తం నుంచి మినహాయించుకుని రైతుల వాటా బ్యాంకులు చెల్లించే విధానం అమలులో ఉందని పేర్కొన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రతిపాదించిన విధానంలో రైతులే బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. బ్యాంకులు, ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించవని తెలిపారు. బాధ్యత రైతుల మీదే పెట్టడం ఏ మాత్రం సరైంది కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల బీమా విధానంలో ప్రధానమంత్రి ఫసల్ బీమాలో భాగంగా ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు. ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభాలు తప్ప రైతుల ప్రయోజనాలు ఏ మాత్రం పట్టించుకోరని పేర్కొన్నారు. గత అనుభవం దీనినే తెలియజేస్తుందన్నారు. విధానం రైతులకు తీవ్రంగా నష్టం కలిగిస్తుందని తెలిపారు. కనుక ప్రభుత్వ ఇన్సూరెన్స్ కంపెనీలను మాత్రమే పంటలబీమాలో భాగస్వాములను చేయాలన్నారు. కనుక ప్రభుత్వం పునః పరిశీలించుకోవాలని కోరారు. రైతులకు లాభదాయకమైన సమగ్ర ఉచిత పంటల బీమా విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణయ్య

ఎస్‌సి వర్గీకరణ జోలికొస్తే బుద్ధి చెబుతాం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎస్‌సి వర్గీకరణ జోలికొస్తే టిడిపి, బిజెపిలకు బుద్ధి చెబుతామని రాయలసీమ మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని స్థానిక వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఏడుగురు జడ్జీలతో కూడిన కమిటీ ఇచ్చిన తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ఎస్‌సి రిజర్వేషన్ల ఎత్తి వేయడానికి కుట్ర పూరితంగా పన్నుతోందని మండిపడ్డారు. ప్రస్తుత జనాభా ప్రాతిపదికన ఎస్‌సి రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. 2014లో ఎస్‌సి వర్గీకరణ జోలికి రావడం వల్లే టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయిందని విమర్శించారు. ఆర్టికల్ 341 ప్రకారం సవరణ చేయకుండా విభజించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఎస్‌సి వర్గీకరణ విషయంలో ఏక పక్ష నిర్ణయం తీసుకుంటే న్యాయ వ్యవస్థ మీద ప్రజల్లో విశ్వాసం కోల్పోతుందని పేర్కొన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనా విధానానికి తూట్లు పొడిస్తే ప్రజా క్షేత్రంలో న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, అలా చేయడం కుదరదని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఎస్‌సి వర్గీకరణకు ఏ పార్టీ మద్దతు తెలిపినా ఆ పార్టీకి బుద్ధి చెబుతామన్నారు. రాయలసీమ ఇన్‌ఛార్జి మిట్టా సునీత కుమారి మాట్లాడుతూ గతంలో మాల మాదిగలు టిడిపికి మద్దతు తెలిపి గెలిపించారని చెప్పారు. చంద్రబాబు మాత్రం మాలల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. మళ్లీ ఇప్పుడు ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావడంతో ఎస్‌సి వర్గీకరణను తెరపైకి తెచ్చి మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సాతిరి లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షులు నర్రా వెంకట సుబ్బయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మొలక గోపాల్, జిల్లా ఆర్గనైజర్ పందిటి రవికుమార్ పాల్గొన్నారు.

రేపు విజయజ్యోతి ప్రమాణ స్వీకారం



ప్రజాశక్తి - కడప : వైఎస్ఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్.డి. విజయ జ్యోతి ఈనెల 18న ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు నగరంలోని మహావీర్ సర్కిల్ నుంచి కార్యకర్తలతో ర్యాలీగా వచ్చి కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారంలో పాల్గొంటారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో పార్టీ విధి విధానాలను వెల్లడిస్తారు. భోజనానంతరం మధ్యాహ్నం మూడు గంటలకు కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు, గతంలో కాంగ్రెస్ పార్టీ తరపున అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీ చేసిన నాయకులతో, సీనియర్ నాయకులతో సమావేశమౌతారు.

ఎన్‌సిసితోనే క్రమశిక్షణ

ప్రజాశక్తి - కడప

ఎన్‌సిసితోనే క్రమశిక్షణ, ఉన్నత లక్షణాలు అలవడతాయని కల్నల్ కిషన్ దత్ అన్నారు. కడప ఎన్‌సిసి నగర్ లో 30 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కడప కమాండింగ్ అధికారి కల్నల్ సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో 7వ ఎన్‌సిసి కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరం రెండో రోజు సోమ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్నల్ కిషన్ దత్ మాట్లాడుతూ ఎన్‌సి సితోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. క్రమశిక్షణ, ఐకమత్యంతో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని చెప్పారు. అనంతరం విద్యార్థులకు ఎన్‌సిసి ఆవశ్యకత, నాయకత్వ లక్షణాలు , ఫిజికల్ ట్రైనింగ్, 22 రైఫిల్ , మ్యాప్ రీడింగ్ అంశాలపై శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి పసు పుల రాజశేఖర్, సిటిఒలు పవన్, సురేందర్ నాయక్, హైదర్, పెరేడ్ శిక్షకులు సుబేదార్ మేజర్ అనిల్ కుమార్, సి ఎల్ రెడ్డి, కొండారెడ్డి, జయసుధ ఎన్‌సిసి కేడెట్లుపాల్గొన్నారు.

తేక్వాండో పోటీల్లో పీస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని మరియాపురంలో ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు కడప నగరంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తేక్వాండో పోటీలలో పీస్ ఇస్లామిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ సయ్యద్ గౌస్ పీర్ తెలిపారు. సోమవారం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు ఆట, పాటల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.తమ పాఠశాల విద్యార్థులు 2 గోల్డ్, 1 సిల్వర్, 1 బ్రాంజ్ గెలుచుకున్నారని తెలిపారు. వారిలో 6వ తరగతి కి చెందిన షేక్. ఇబ్రహీం(గోల్డ్ మేడల్), సయ్యద్ ఇబ్రహీం ఖలీలుల్లా (గోల్డ్ మెడల్), 3వ తరగతి కి చెందిన ఖాలీద్ (సిల్వర్ మెడల్), 6వ తరగతికి చెందిన సి. ఎస్. ఇసాక్ (బ్రోంజ్ మెడల్) సాధించినారని తెలిపారు.



మెడల్స్ సాధించిన విద్యార్థులు


ప్రభుత్వం లేఖ రాయడం శోచనీయం : సిపిఎం

ప్రజాశక్తి -కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటును రద్దు చేయాలని ప్రభుత్వమే లేఖలు రాయడం ఏమిటని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, దస్తగిరి రెడ్డి ప్రశ్నించారు. సోమవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలపై చంద్రబాబు సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామన్న హామీ ఏమైందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్‌డిఎ కూటమి నిర్వాకంతో ఈ ఏడాది 50 ఎంబిబిఎస్ సీట్లు పోయాయని చెప్పారు. చంద్రబాబు 'పి4' జపంతో గుజరాత్ మోడల్ పేరుతో ప్రయివేటు వ్యక్తులకు మెడికల్ కళాశాలలు అప్పుజెప్పడం కోసం ఈ ఏర్పాట్లు చేస్తున్నారని విమర్శి ంచారు. దీనివల్ల పేదలకు, మెరిట్ వచ్చిన విద్యార్థులకు ఏకంగా 1,750 సీట్లకు ఎసరు పెట్టారని తెలిపారు. పులివెందుల కళాశాలకు ఎల్‌ఒపి ఇచ్చిన జాతీయ వైద్య కమిషన్ కళాశాలను నిర్వహించలేమని గుట్టు చప్పుడు కాకుండా లేఖ రాసిన సర్కారు ఎల్‌ఒపి ఇవ్వలేదని అధికారుల బుకాయింపు ఖండిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలను ప్రయివేట్ పరం చేసి, వైద్య విద్యను ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టాలని చూస్తున్నారా అని ప్రశ్నించారు. ఇప్పటికే అందని ద్రాక్షలా మారిన వైద్య విద్యను పేద విద్యార్థులకు మరింత దూరం చేసే ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా అన్నారు. గుజరాత్ పిపిపి విధానంపై ఎందుకు అధ్యాయనం చేయాలని అనుకున్నారని ప్రశ్నించారు. కూటమి సర్కార్ లో భాగస్వామ్య పక్షంగా ఉండి, ఈ ఏడాది ఐదు కొత్త కళాశాలకు వసతులను కల్పించలేమని,మెడికల్ బోర్డుకి లేఖ రాయడాన్ని వ్యతిరేకిస్తు న్నామని తెలిపారు. దీనివల్ల రాయలసీమ పరిధిలోని ఎస్‌వి యూనివర్సిటీ విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. కొత్త మెడికల్ కళాశాలలో వసతులను కల్పించి, మరింత నాబార్డ్ కింద నిధులు తీసుకొచ్చి వైద్య కళాశాలను పూర్తి చేసి ఈ ఏడాది నుంచే వాటిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

న్యాయవాదుల సేవలు ప్రజలకు అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రస్తుత పరిస్థితులలో న్యాయవాదుల సేవలు ప్రజలకు ఎంతో అవసరమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆలంఖాన్ పల్లె లక్ష్మీరెడ్డి అన్నారు. సోమవారం అంతర్జాతీయ న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా సీనియర్ న్యాయవాది సురేష్ కుమార్, సాల్మన్, చంద్రమోహన్, రాహుల్, న్యాయవాదులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మ రక్షకులుగా న్యాయవాదులు ఉన్నంతవరకు సామాన్య ప్రజలకు న్యాయం దక్కు తుందన్నారు. ప్రస్తుతం ప్రజలకు న్యాయ సేవలు ఎంతో అవసరమని, న్యాయమూర్తులు పేద, మధ్య తరగతి ప్రజలకు న్యాయ సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



న్యాయవాదిని సన్మానిస్తున్న లక్ష్మీ రెడ్డి

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : మిలాద్ ఉన్ నబి సందర్భంగా విలాద్ జూలూస్ ఆధ్వర్యంలో కడపలో భారీ ర్యాలీ నిర్వహించారు. అల్మాస్‌పేట సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ చిలకల బావి, రెండో గాంధీబొమ్మ, వన్ టౌన్ సర్కిల్, గోకుల్ సర్కిల్, 7రోడ్స్, పాత బస్టాండ్ సర్కిల్ మీదుగా గుంతబజార్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్. అమీర్ బాబు, సంఘ సేవకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు సలావుద్దీన్, ముస్లిం మత పెద్దలు, ఇమాములు,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

బాస్కెట్‌బాల్ పోటీలకు గాయత్రి కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ –19 బాస్కెట్‌బాల్ బాలికల విభాగంలో కడప నగరంలోని గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థినులు యశస్విని, రిజ్వానా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల సిఇఒ పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న వేంపల్లిలోని గురుకుల పాఠశాలలో జిల్లా స్థాయి ఎంపికలలో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు అక్టోబర్ లో శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.


సమస్యలను ప్రిన్సిపల్ సెక్రటరీకి వివరిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

జిఒ 115ను రద్దు చేయాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జిఒ 115ను రద్దు చేయాలని, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని సోమవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ముందు నర్సులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా చదువుకున్న నర్సింగ్ విద్యార్థులను గుర్తించాలన్నారు. జిఎన్ఎం, బీఎస్‌సి, ఎంఎస్‌సి, పీహెచ్‌డీ వ్యవస్థను గుర్తించాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలన్నారు. 15 ఏళ్ల నుంచి నర్సులుగా చేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకుండా కొత్తగా వచ్చిన ఎఎన్ఎంలను గుర్తించి నర్సు పోస్టులు వేయడం చాలా బాధాకరమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గతంలో ఉన్న వారిని రెగ్యులర్ చేశారన్నారు. అదే తరహాలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడున్న వారిని కూడా క్రమబద్ధీకరించాలన్నారు.

మద్దతు తెలిపిన ఎంపీ అవినాష్‌రెడ్డి

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న నర్సులకు ఎంపీ అవినాష్‌రెడ్డి మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారి కోరికలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ సెక్రటరీ కృష్ణబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. నర్సుల సమస్యలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఎస్టీవో అధ్యక్షుడు జగన్నాథ్ రెడ్డి, తైజాల, హారిక, శిరీష పాల్గొన్నారు.



పతకాలు సాధించిన ఎర్రగుంట్ల విద్యార్థులు

రాష్ట్ర స్థాయిలో ఎర్రగుంట్ల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఈ నెల 14, 15 తేదీల్లో కడపలో డెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ నిర్వహించిన 1వ ఓపెన్ స్టేట్ తేక్వాండో ఛాంపియన్‌షిప్-2024 సీనియర్స్ విభాగంలో ఎర్రగుంట్ల జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు. వివిధ జిల్లాల నుంచి దాదాపు 300 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారని సీనియర్ మాస్టర్ వి.సుమన్ బాబు, కోచ్ జాకట దినేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రగుంట్లకు చెందిన ఎస్.అమానుల్లా, డి.సుజయ్ ఫోన్‌ప్ బంగారు పతకం, ఎస్.హస్సేన్ వెండి పతకం సాధించగా, బాలికల విభాగంలో మహిత, రక్షిత, బంగారు పతకం సాధించగా, ఎం.గమన వెండి పతకం, ఎం.గగన కాంస్యపతకం సాధించారు. జూనియర్స్ విభాగంలో బాల సాయి సాత్విక్, చంద్రకాంత్ బంగారు పతకం, పి.ఎస్ షమీర్ హుస్సేన్, ఎస్.యష్వంత్‌రెడ్డి వెండి పతకం సాధించగా, సబ్ జూనియర్స్ విభాగంలో పి.రెడ్డి సాత్విక్, సి.వెంకట సాయి తులసినాథ్, పి. యశ్వంత్, ఎం.కార్తీక్ బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. అనంతరం కోచ్ జాకట దినేష్ మాట్లాడుతూ గ్రాండ్ మాస్టర్ ఎం.నాగూర్ మాస్టర్ ఇంటర్నేషనల్ తేక్వాండో అకాడమీలో శిక్షణ పొందుతున్నాడని, యర్రగుంట్ల జడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -ఖాజీపేట

ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అభినయ్ కోరారు. సోమవారం ఖాజీపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణ పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోందన్నారు. బాలిక ఉన్నత పాఠశాలలో హిందీ, వ్యాయామ ఉపాధ్యాయులు కొరత ఉందన్నారు. ఆదర్శ పాఠశాలలో వంటగది లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వివరించారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో ఆ శాఖ అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమం నాయకులు సునీల్, హేమసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని నందిపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమా దంలో ఉపాధ్యాయుడు శ్రీనువాసులురెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం పని నిమిత్తం మండలంలోని నందిపల్లె గ్రామం నుండి మోటర్ బైకులో శ్రీను వాసులురెడ్డి వస్తుండగా గుర్రమ్మ అనే మహిళ లిఫ్ట్ అడగ్గా మోటర్ బైకును నిలి పారు. దీంతో వెనుక వైపు నుండి మరో మోటర్ బైకు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయుడు శ్రీను వాసులు రెడ్డికి, గుర్రమ్మ అనే మహిళకు రక్త గాయా లయ్యాయి. 108 ద్వారా వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు.


గాయపడిన శ్రీనువాసులురెడ్డి

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాశినాయన

పోరుమామిళ్ల పట్ట ణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్ ఆవరణలో ఈదుల పల్లె గ్రామానికి చెందిన రమేష్ (40) ఉరి వేసుకుని చనిపోయాడు. ఇది ఆత్మహత్య కాదని, హత్య చేసి ఇలాచిత్రీకరించారని రమేష్ బంధువులు ఆరోపి స్తున్నారు. ఆ మేరకు బాధితులు ఆందోళన చేయడంతో పోలీసులు సంఘట నాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభు త్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోరు మామిళ్ల ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మృతుడికి ఎలాంటి గాయాలు లేవని, అర్ధరాత్రి సమయంలో అతనే తాడు తీసుకుని చెట్టు దగ్గరికి వెళుతున్నట్లు సీసీ కెమెరాల్లో ఉందని ఎస్ఐ తెలిపారు. ఈవిషయాన్ని బంధువులకు కూడా చూపించామని, అయినా వారి ఆరోపణల మేరకు విచారిస్తున్నామన్నారు.


మృతి చెందిన రమేష్

వంతెన నిర్మాణానికి ఏళ్ల తరబడి ఎదురుచూపు


భారీ వర్షానికి నీట మునిగిన వంక (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రానికి సమీపంలోని నక్కలదిన్నె గ్రామానికి వెళ్లే దారిలో గుండ్ల వంకపై ఉన్న వంతెన ఎన్నో ఏళ్లుగా ఆధునికరణకు నోచుకోవడం లేదు. దీంతో వర్షాకాలంలో ఈ మార్గాన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అధిక వర్షాలు పడిన సమయంలో నీరు తగ్గుముఖం పట్టే వరకు మండల కేంద్రంతో సంబంధాలు లేకుండా పోతున్నాయి. శాస్త్ర సాంకేతికంగా దేశం ఎంతగానో అభివృద్ధి చెందినప్పటికీ పల్లెలు మాత్రం పాత విధానంలో నడవాల్సి వస్తోంది. వర్షం వస్తే కొన్ని రోజులుగా మండల పరిధిలోని కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు గ్రామాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి. ప్రభుత్వాలు మారుతున్నా వాగులు, వంకలపై పురాతన పాత వంతెనలే దర్శనమిస్తున్నాయి. అవి మునకకు ఆస్కారం లేకుండా హై లెవెల్ బ్రిడ్జిల ఏర్పాటు జరగడం లేదు. వర్షానికి నీట మునిగిన సందర్భంలో ఆర్అండ్‌బి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం.. తర్వాత వాటి గురించి పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. మూడేళ్ల క్రితం వారం రోజులపాటు రాకపోకలు నిలిచిపోయిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం ఉన్న వంతెన తక్కువ ఎత్తులో ఉండడం వల్ల వంకకు నీరు అధికంగా వచ్చినప్పుడు మునుగుతుంది. ప్రస్తుతం వంతెన పూర్తిగా దెబ్బతిని ఇబ్బందికరంగా మారింది. ఈ మార్గాన రాజువారిపేట, అయ్యవారిపల్లె, తిమ్మాయిపల్లి, నక్కలదిన్నె, అనంతపురం, కుచ్చుపాప, రాజు పాలెం, నరహరిపురం, వెదురూరు, రామసుబ్బమ్మ కొట్టాల గ్రామాల ప్రజలు ప్రయాణించాల్సి ఉంది. వర్షాకాలంలో ఈ మార్గాన రాకపోకలు నిలిచిపోతే ఆయా గ్రామాల ప్రజలు తాళ్లమాపురం, ప్రొద్దుటూరు మీదుగా మండల కేంద్రం చాపాడుకు రావాల్సి ఉంటుంది. అలాగే మండల పరిధిలోని గుంత చియ్యపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న వంతెన కూడా ప్రమాదపు అంచున ఉంది. మోస్తరు వర్షం వచ్చినా ఈ వంతెన నీట మునుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాబోయే వర్షాకాలానికైనా వంతెనలను గుర్తించి హై లెవెల్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ప్రస్తుతం అందుబాటులో ఉన్న లో లెవెల్ బ్రిడ్జి

కొత్త మెడికల్ కళాశాలలను ప్రయివేట్ వ్యక్తుల చేతికివ్వొద్దు : డివైఎఫ్ఐ



మాట్లాడుతున్న వీరనాల శివకుమార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కొత్త మెడికల్ కళాశాలలను తేకుండా రద్దు చేయాలని ప్రభుత్వమే లేఖలు రాయడమేమిటని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ప్రశ్నిచారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో సోమ వారం జరిగిన విలేకరుల సమావేశంలో గుర్రం డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలపై 'చంద్రబాబు కత్తి! సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామన్న టీడీపీ హామీ ఏమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్‌డిఎ కూటమి నిర్వాకంతో ఈ ఏడాది 50 ఎంబీబీఎస్ సీట్లు పోయాయన్నారు. చంద్రబాబు గుజరాత్ మోడల్ పేరుతో ప్రయివేట్ వ్యక్తులకు మెడికల్ కాలేజి అప్పజెప్పడం కోసం ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. దీనివల్ల మెరిట్ వచ్చిన పేద విద్యార్థులకు ఏకంగా 1,750 సీట్లకు ఎసరు పెట్టారన్నారు. పులివెందుల కాలేజీకి ఎల్వోపీ ఇచ్చిన జాతీయ వైద్య కమిషన్ కాలేజీని నిర్వహించలేమని గుట్టుచప్పుడు కాకుండా లేఖ రాసిన సర్కారు ఎల్వోపీ ఇవ్వలేదని అధికారుల చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలను ప్రయివేట్ పరం చేసి, వైద్య విద్యను వారి చేతుల్లో పెట్టాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికే అందని ద్రాక్షలా మారిన వైద్య విద్యను పేద విద్యార్థులకు మరింత దూరం చేసే ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. ఎస్‌వి యూనివర్సిటీ విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్ , నాయకులు, విశ్వనాథ, రమేష్, హరి పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయవద్దని వై సిపి పార్టీ ఎస్సీ సెల్ విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జమ్మలమడుగులో ఆయన మాట్లాడుతూ పులివెందులలో మెడికల్ కాలేజీ సీట్లు 50ని కేటాయిస్తే ఈ సీట్లను పెంచాల్సింది పోయి, ఉన్న సీట్లను కూడా వద్దనడం మంచి పద్ధతి కాదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ 17లో ప్రస్తుతం అయిదు కాలేజీలు అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లాలో ఉన్న పులివెందల మెడికల్ కాలేజీ కూడా అందులో ఒకటన్నారు. రాష్ట్రాల్లో ముఖ్యంగా మెడికల్ సీట్ల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయడం అనే ఆలోచన ఉంటే వెంటనే విరమించుకోవాలని , లేనిపక్షంలో పేదల పక్షాన ఉద్యమిస్తామని తెలిపారు.


ఉప్పలపాటి యోబు

రక్తదానం సామాజిక బాధ్యత : న్యామతుల్లా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని, అవసరానికి రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండడం బాధాకరమని, ప్రతి ఒక్కరూ రక్తదానం సామాజిక బాధ్యతగా భావించాలని న్యామతుల్లా తెలిపారు. రక్తదానం చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఇప్పటికి తాను 50 సార్లు రక్తదానం చేశానని న్యామతుల్లా పేర్కొన్నారు. ముందుగా తాను 1992లో దువ్వూరు మండలానికి చెందిన ఓ మాజీ సర్పంచ్‌కు రక్తదానం చేశానని తెలిపారు. అనంతరం అతని కళ్లల్లో కనిసించిన ఆనందం, తృప్తి తనను రక్తదానం వైపు నడిపించాయని తెలిపారు. అనంతరం కొంత కాలానికి అమల్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనే సందర్భంలో గ్రామీణ ప్రాంతాల్లో కొంత మంది మహిళలు తనను గుర్తించి 'మీరిచ్చిన రక్తంతోనే శక్తిని కూడదీసుకొని ఈ బిడ్డను ప్రసవించాను' అని అక్కడక్కడ చెప్పడం తనను పూర్తిగా రక్తదానం వైపు కార్యోన్ముఖుడ్ని చేసిందని న్యామతుల్లా వివరిం చారు. రక్తదానం చేయడం వల్ల అనేక ఆరోగ్యకర ప్రయోజనాలున్నాయన్నారు. గుండె పోటొచ్చే ప్రమాదం, క్యాన్సర్ వచ్చే ప్రమా దం తగ్గుతుందన్నారు. బరువు తగ్గుతామన్నారు. చెడు రక్తం, చెడు కొలెస్ట్రాల్ బయటికి వెళ్లి ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉందన్నారు. ఒకసారి రక్తం ఇచ్చిన అనంతరం 100 రోజుల తర్వాత మళ్లీ ఇవ్వవచ్చన్నారు. 18ఏళ్లు దాటిన అనంతరం ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి రక్తదానం చేయవచ్చన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బ్లడ్ డొనేటింగ్ ఆర్గనైజేషన్ (ఫిబ్డో)లో తనకు సభ్యత్వం ఉందన్నారు. ఈ సంస్థ భారతదేశంతోపాటు విదే శాల్లో కూడా ఉందన్నారు. తన వద్ద వేల సంఖ్యల్లో రక్తదాతల సెల్ నంబర్లున్నాయని, దీనొక ఉద్య మంలా నడపిస్తున్నానన్నారు. రక్తం అత్యవ సరమైతే ఆ ప్రాంతంలోని బస్‌స్టాండ్‌కు వెళ్లి ము గ్గురు నలుగురు యువకులతో అభిప్రాయాన్ని పంచుకుంటే సులభతరమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో విదేశాల నుండి కూడా తనకు ఫోన్ కాల్స్ వస్తుంటాయని తెలిపారు. తనతో పాటు తన ముగ్గురు పిల్లల రక్తగ్రూప్ బి.పాజిటివ్ అని తన పిల్లలు కూడా తరచూ రక్తదానం చేస్తుం టార న్నారు. రక్తదానంపై అపోహలు వద్దన్నారు. కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతాలకతీతంగా రక్త సంబంధాన్ని నెలకొల్పేది రక్తదానం మాత్రమే అన్నారు. 18ఏళు నిండిన ప్రతి వ్యక్తి రక్తదానం చేసి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని న్యామతుల్లా కోరారు.



సీతారాం ఏచూరికి ఘన నివాళులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎంఆర్‌పిఎస్ దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ కాలనీలో సోమవారం ఇటీవల ఢిల్లీ ఎయిమ్స్‌లో మరణించిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు మాట్లాడుతూ చెన్నైలో స్థిరపడిన తెలుగు కుటుంబంలో జన్మించిన సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే తాను నమ్మిన సిద్ధాంతం కోసం, పేద ప్రజల అభ్యున్నతికి నిరంతరం పోరాటాలు చేశారన్నారు. దేశంలోనే ప్రముఖ రాజకీయ నాయకుడిగా, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఆ పార్టీ పార్లమెంట్ వర్గపు నాయకుడిగా విశిష్ట గుర్తింపు పొందిన కమ్యూనిస్టు యోధుడని కొనియాడారు. ఆయన మరణం పట్ల ఎంఆర్‌పిఎస్, దాని అనుబంధ సంఘాల తరఫున తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఇఎఫ్ సీనియర్ నాయకులు ఆర్.రామన్న, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.చిన్నయ్య, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మేకల ఆంజనేయులు, ఎంఇఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీ కె.కొండయ్య, నియోజకవర్గ అధ్యక్షులు కె.బాల ఓబయ్య, ప్రధాన కార్యదర్శి ఎన్.సి.ఓబులేసు, వై.చంద్రకుమార్, రాం పుల్లయ్య, ప్రతాప్ పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ జన్మదిన సందర్భంగా సోమవారం ప్రొద్దుటూరులో సత్య యువసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి, ఒంటేరు భాస్కర్‌రెడ్డి, చిరంజీవి, సత్య యువసేన అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలిగించొద్దు

ప్రొద్దుటూరు : భక్తులకు అసౌకర్యాన్ని కలిగించే నిర్ణయాన్ని మున్సిపల్ అధికారులు వెనక్కు తీసుకోవాలని ఎంఆర్‌పియస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ కోరారు. కూరగాయల మార్కెట్ వద్ద జూటూరు కళాక్షేత్రం పక్కన ఉన్న పెద్దమ్మ దేవాలయం రూములు, వంటశాల అమ్మవారి సామాన్లు భద్రపరిచే గదులు భక్తుల భోజనశాల తొలగించమని నాలుగు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి ఇచ్చిన ఉత్తర్వులకు నిరసనగా సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో స్థానికులు చేపట్టిన ధర్నా సోమవారానికి మూడవరోజుకు చేరుకుంది. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర యువసేన ఉపాధ్యక్షులు సాకే నారాయణస్వామి, ప్రసాద్, సుబ్బరాయుడు, మహిళలు పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని నాలుగు రోడ్ల కూడలి దగ్గర అన్న క్యాంటీన్‌ను బుధవారం శాసన మండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


ర్యాలీలో ప్రసంగిస్తున్న పీఠాధిపతి

మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ముస్లింలందరూ చేస్తున్న మీలాదున్నబీ పండుగలో సోమవారం శాంతి యుత ర్యాలీ కన్నుల పండుగగా నిర్వహించారు. పట్టణంలోని జామియా మసీదు వద్ద అస్థాన ఏ కమాలియా పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్ పాషా ఖాద్రి ఆధ్వర్యంలో అధికసంఖ్యలో ముస్లింలు చిన్న, పెద్ద కలిసి శాంతి ర్యాలీ ప్రారంభించారు. మెయిన్ బజార్, కూరగాయల మార్కెట్, పాత బస్టాండు, గాంధీ సర్కిల్, తాడిపత్రి రోడ్డు మీదుగా ఎంపీడీవో ఆఫీస్ రోడ్డు, సాయిరాం థియేటర్ వద్దకు ర్యాలీ సాగింది. ర్యాలీలో పీఠాధిపతి సోదరులు, కుటుంబీకులు, ముస్లిం మైనార్టీ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కౌన్సిలర్ ముల్లా జానీ, కో-ఆప్షన్ సభ్యులు దఫేదార్ ఫయాజ్ బాషా, కౌన్సిలర్లు, పెద్దలు, చిన్నారులు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు.

ఖాజీపేట : మిలాద్ ఉన్ నబీ పండుగను సోమవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువులు మహమ్మద్ ప్రవక్త గురించి బోధించారు. మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయమన్నారు. ప్రతి ఒక్కరూ దానగుణం అలవర్చుకొని పరులకు సాయపడినప్పుడే జీవితానికి సార్ధకత చేకూరుతుందని వివరించారు. ముస్లింలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వేంపల్లె : మహమ్మద్ ప్రవక్త సందేశాలు, జీవన విధానం ప్రతి ఒక్కరికీ ఆదర్శం, అనుసరణీయం, స్ఫూర్తిదాయకమని పిసిసి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో ఇస్లామిక్ మత స్థాపకుడు, ఆధ్యాత్మిక, సామాజిక, రాజకీయ గురువైన మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు పరమ పవిత్రమైనదన్నారు. 1454 సంవత్సరాల క్రితం సౌదీ అరేబియా దేశంలోని మక్కా నగరంలో మహమ్మద్ ప్రవక్త జన్మించారని చెప్పారు. మహమ్మద్ ప్రవక్తగానే కాకుండా గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. ఆనాటి సమాజంలోని సాంఘిక దురాచారాలను నిర్మూలించేందుకు కృషి చేశాడని వివరించారు. ముస్లింలకు తులసిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రొద్దుటూరు : సృష్టిలో మానవులంతా ఒక్కటే అని పరస్పర సహకారంతో మెలిగినప్పుడే జన్మసార్థకత అవుతుందని అంజుమన్ కమిటీ మాజీ అధ్యక్షుడు ముక్తియార్ అన్నారు. మిలాదున్నబీ పండుగ సందర్భంగా సోమవారం పట్టణంలోని ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక నజురుల్లా కళ్యాణమండపం నుండి ఆసారెషరీఫ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి దైవ ప్రవక్త రసూలుల్లా (సొ.అ) జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాదున్నబి జరుపుకుంటున్నామన్నారు. యావత్ మానవాళికి మార్గదర్శకుడిగా నిలిచి సన్మార్గంలో జీవించేందుకు బోధించారన్నారు. ఆర్థిక అసమానతలు లేని సమ సమాజస్థాపనకు ఆనాడే బీజాలు వేశారన్నారు. సౌకర్యంగా ఆరోగ్యవంతంగా జీవించేందుకు బోధనలు చేశారన్నారు. కులమతాల తారతమ్యాలు మనలో లేకుండా సోదరభావంతో మెలగాలన్నారు. ర్యాలీలో పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడారు. అంజుమన్ కమిటీ అధ్యక్షులు బొల్లవరం బాషా, ఉపాధ్యక్షుడు ఇలియాస్, ముస్లిం పెద్దలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


గుర్రప్ప స్వామికి పూజలు చేస్తున్న భూపేష్‌రెడ్డి

గుర్రప్పస్వామిని దర్శించుకున్న భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి నియోజకవర్గంలో సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలోకి ఆయన చేరుకోవడంతో జమ్మలమడుగు, మైలవరం, పెదముడియం మండలాల కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అనంతరం వారితో మాట్లాడి మైలవరం మండలంలోని గుర్రప్ప స్వామి దేవస్థానానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జమ్మలమడుగు మండలం బుక్కపట్నం ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన పాల శేఖర్ ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మల్లికార్జున, ఆలయ కమిటీ, ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరంగనాథుని ఉత్సవాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



పట్టణంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో నూలు పూజ ఉత్సవాలు సోమవారం ముగిశాయి. గత తొమ్మిది రోజుల నుంచి పలు వాహనాలపై భక్తులకు శ్రీ రంగనాథ స్వామి దర్శన మిచ్చారు. చివరి రోజు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
E.P.No. 119 / 2018, O.S No.147 / 2015
1. వి. రాంభూపాల్ రెడ్డి, S/o వి. ప్రభాకర్ రెడ్డి, 38 సం॥లు, డోర్‌నెం. 17/106, సుబ్బరెడ్డిగారి వీధి, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, కడపజిల్లా.
2. పి. వెంకట రఘునాథరెడ్డి, S/o వెంకటరెడ్డి, 44 సం॥లు, డోర్ నెం. 15/488, బాలాజి నగర్ వీధి, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలం, కడప జిల్లా.
పిటీషనరు నెంబరు 1 మరియు 2 రిప్రజెంటెడ్ బై థర్డ్ రిజిష్టరు జనరల్ పవర్‌ఆఫ్ అటార్నీ హోల్డర్ పల్లా వెంకట సుబ్బయ్య, S/o వెంకట సుబ్బయ్య 63 సం॥లు, హిందూ, బిజినెస్, డోర్‌నెం. 8/350, స్వయం సేవక్ రోడ్డు, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. ....పిటీషనర్లు / DHr.
Vs
3. రావలూరు విజయలక్ష్మి, W/o రావలూరు సురేష్, 34 సం॥లు, హిందూ, డోర్‌నెం. 1/367-1, మారుతినగర్, కడప సిటి మరియు జిల్లా.
....3వ రెస్పాండెంటు/J.
నోటీసు
ఈ నెంబరు E.P లోని షెడ్యూల్ దాఖలా ఆస్థిని రాజశ్రీకోర్టు వారు ఉత్తర్వు మేరకు దిక్కరించినందున షెడ్యూల్ దాఖలా ఆస్థిని పిటిషనర్లకు అప్పగించనందున పోలీస్ వారి సహాయంతో తొలగించి షెడ్యూల్ దాఖల ఆస్థిని పిటిషనర్లకు అప్పగించుటకు గానూ దాఖలు చేసి ఉంటున్నారు. అట్టి E.P లో మీరు హాజరగుటకు గానూ 24/09/2024 వ తేదిన వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా నాడు పై కోర్టులో ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ ఏదేని ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టులో తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
వాయిదా తేది: 24-09-2024.
By Order of the Court
Sri. G. Srinivasulu, B.com, B.L.,
Advocate, Proddutur.